# ఆమె మనసు

"నేను నచ్చిన మీకు,

పెళ్ళిచూపుల కార్యక్రమం పూర్తికాగానే 'ఇంటికి వెళ్ళివుత్తరం రాస్తాం' అన్న మీ మాటలు విని ఇప్పటివరకూ చూసివెళ్ళిన అందరిలాగానే మీరూ మౌనం వహించి ఊరుకుంటారనుకున్న మా వాళ్ళందరికీ నేను మీకు నచ్చానని. ముహూర్తాలు పెట్టించే ఏర్పాట్లు చేయమని మీరు రాసిన ఉత్తరం ఎంతో సంతోషం కలిగించింది.

"సంతోషం కలిగించింది నాకు తప్ప మా కుటుంబ సభ్యులందరికీ అనే విషయం మీరు గమనించాలని మరోసారి ప్రత్యేకంగా ఈమాట రాస్తున్నాను. ఆశ్చర్య పడుతున్నారు కదూ! నేను నిజమే రాస్తున్నాను. నాకు సంతోషం కలగక పోవటానికి కారణం మీకు తెలియజేయటం సంస్కార మనిపించుకుంటుంది. కానీ కారణం నాకే తెలియదు.

"ఎందరికో నచ్చని మీకు నచ్చినందుకు మాత్రం ఆనందంగానే ఉంది. ఎందువల్లనో చెప్పలేను కానీ నాకుమాత్రం మీరునచ్చలేదు. అయినా ఈ విషయం మీ ఒక్కరితో తప్ప మరెవ్వరికీచెప్పలేదు. చెప్పలేను, చెప్పను కూడా. ఈ ఉత్తరం చదివాక కూడా మీ

నిర్ణయం మార్చుకోకపోతే మిమ్మల్ని వివాహం చేసుకోవటానికినాకు అభ్యంతరం మాత్రం లేదు. మన పెళ్ళి తప్పక జరుగుతుంది.

"జరుగుతున్న పెళ్ళిళ్ళన్నీ వధూవరు లిద్దరికీ పూర్తి ఇష్ట పూర్వకంగా జరుగుతున్నవే అని నేను అనుకోను. విచిత్రమైన పరిస్థితుల్లో, వివిధ కారణాలవల్ల, వత్తిడివల్ల జరుగుతున్న వివాహాలు ఎన్నో.

"ఇక మీకు నచ్చిన నా గురించి మీకు కొన్ని విషయాలు చెప్పదలుచుకున్నాను. సహృదయంతో అర్థం చేసుకుంటే అదృష్ట వంతురాల్ని. ఇలా మీరు నాకు నచ్చలేదని చెప్పటం నా అహంకారం కాని, అతిశయం కానీ కానేకాదు.

"నేను కాలేజీలో చదివే రోజుల్లో మా ఇంట్లో ఎప్పుడైనా నా పెళ్లి ప్రస్తావన వస్తే 'మాబంగారానికి అయ్యేయస్ ఆఫీసర్ని తీసుకు వస్తాను. అయినా మా బంగారుకొండను చేసుకోవటానికి పెళ్ళికొడుకులు క్యూలో నిల్చుంటారు' అంటుండేవాడు మా అన్నయ్య. వాడి మాటలు విని నాలో నేనే మురిసిపోయేదాన్ని. వాడికి నా మీదున్న ప్రేమకు మా అమ్మా నాన్న కూడా ఎంతో సంతోషపడేవారు. తరచుగా వాడిలా మాట్లాడటం నాలోనేనే సంబరపడిపోవడం కాబోయే వాడ్ని గురించి కలలు కంటూ ఉండటం జరిగేవి,

నా చదువు పూర్తయింది. పెళ్లిచూపుల ప్రహసనం ప్రారంభమయింది. మొట్టమొదటి పెళ్ళిచూపుల కార్యక్రమం చాలా ఆడంబరంగా జరిపించాడు మా అన్నయ్య. ఓ ఆయ్యేయస్ ఆఫీసరు తల్లిదండ్రులతో కూడా వచ్చాడు నన్ను చూసేందుకు. నేను అతనికి నచ్చలేదు.

అతగాణ్ణి మా అన్నయ్య తిట్టినతిట్టు తిట్టకుండా తిట్టేడు. అంత కంటే గొప్ప సంబంధం తెస్తానన్నాడు. అతన్లో తప్పులన్నీ ఎత్తి చూపేడు. అతని అందాన్ని అవహేళన చేశాడు. వాడి మాటలకు ఇంట్లో అందరం నవ్వుకున్నాం. ఓ వారం రోజులపాటు ఆ కార్య క్రమం మాకు మంచి కాలక్షేపాన్ని కలిగించింది.

"ఓ పదిమంది వరకు అయ్యేయస్ ఆఫీసర్లు నన్ను చూసి వెళ్ళారు. వాళ్ళెవరికీ నేను నచ్చలేదు. ఓ రెండు సంవత్సరాలుఅలా గడిచిపోయాయి. నాతోపాటు మా అన్నయ్య మనసులోకూడా నిరాశ చోటుచేసుకున్నది. ఇంట్లో వాళ్ళంతా ఓ మెట్టు కిందకు దిగారు. డాక్టర్లు, ఇంజనీర్లు లేక ఉన్నతాధికారులు మా అన్నయ్య దృష్టిలో చోటు చేసుకున్నారు. వారికోసం అన్వేషణ ప్రారంభించాడు. ఆ స్థాయి వ్యక్తులుకూడా ఓ అరడజను మందికి పైగా నన్ను చూసి వెళ్ళారు. వాళ్ళెవరికీ కూడా నేను నచ్చలేదు.

నా పెళ్ళి మా ఇంట్లో వాళ్ళకు సమస్యగా మారింది. అమ్మ నాన్నలకు ఇదో మానసిక వ్యథగా మిగిలింది. నా పెళ్ళి చూపుల కార్యక్రమం అనగానే మా అన్నయ్యకు విసుగు కలిగే విధంగా మారింది. తప్పనిసరన్నట్లు ఆ తంతు కాస్తా ముగిసిందనిపించేవాడు.

అలా మరో రెండున్నర సంవత్సరాలు కాలగర్భంలో కలిసి పోయినై. అమ్మ నాన్నల్తోపాటు నా బలవంతం కూడా ఉండటం వల్ల అన్నయ్య పెళ్ళి చేసుకున్నాడు. అన్నయ్య పెళ్ళి సంబరం, కొత్తగా వచ్చిన వదినతో కబుర్లతో కొన్నిరోజులు హాయిగా గడిచి పోయినై.

అటు తర్వాత గవర్నమెంటు ఉద్యోగస్తుడయితే చాలనుకొని సంబంధాలు వెతకటం ప్రారంభించారు. ఆస్తి, అందం ఓ పక్కకు నెట్టి నాలుగంకెల జీతం సంపాయిస్తున్న వాడైతే చాలంటూ సర్దు బాటు చేసుకున్నారు. సంతృప్తి పడదాం అనుకున్నారు. అప్పటికే నేను కాబోయే వాణ్ణి గురించి కలలు కనటం మానేసి చాలా కాలం అయింది.

నీ పెళ్లి మా కళ్ళతో చూసుకునే అదృష్టం వున్నదో లేదో అంటూ అమ్మా నాన్నలు కళ్ళ నీళ్ళు పెట్టుకోవటం, అన్నయ్య అది వరకులా శ్రద్ధగా నా పెళ్లి ప్రయత్నాలు చేయటంలేదని మనస్తాపం చెందటం మొదలుపెట్టారు. కానీ నేను మాత్రం మా అన్నయ్యను గురించి ఎప్పుడూ అలా అనుకోలేదు.

పుట్టింటి వారితోనూ, ఇరుగు పొరుగు వారితోనూ నా పెళ్ళి గురించి వదిన వ్యంగ్యపు మాటలు ఎన్నోసార్లు నే వినకపోలేదు. మౌనంగా భరించాను.

మా బంధువుల ఇళ్ళలో ఎక్కడ ఏ శుభకార్యానికి పిలుపు వచ్చినా, అశుభాలకు వెళ్ళవలసి వచ్చినా మా అమ్మానాన్నా తప్ప కుండా నన్ను వాళ్ళవెంట తీసుకువెళ్లేవాళ్ళు. నన్ను వదలి ఒక్క పూటకూడా వాళ్ళు వుండలేక కాదు. వాళ్ళను వదిలి నేను వుండ లేననీ కాదు,

పదిమంది బంధువులు, కొత్తవారుకూడా ఒకచోట కలుస్తారు. పదిమంది చూపుల్లో పడ్డ నేను ఏ ఒక్కరికైనా నచ్చుతానేమో అన్న

ఆశతో మాత్రమే నన్ను తీసుకు వెళ్ళేవాళ్ళు. కానీ పాపం వాళ్ళ ఆశలు అడియాసలే అయినై.

కానీ ప్రస్తుతం నేను మా వాళ్లతో కలిసి ఎక్కడికీ వెళ్ళటం లేదు. అక్కడ చేరిన వాళ్ళంతా నా కింకా పెళ్లి కాలేదని తెలుసు కుని చేసే వ్యాఖ్యానాలకూ, చూసే చూపులకూ నేను తట్టుకోలేనని మావాళ్ళ అభిప్రాయం. నాలో వయసు తెచ్చిన మార్పులు నన్ను బయటకు వెళ్లనీయకుండా కట్టేసినై కొంత వరకు.

మా ఇంటికి ఎవరైనా వస్తే క్లుప్తంగా మాట్లాడటం, మితంగా వారి కంట పడటం చేస్తూండటం అలవాటు చేసుకున్నాను. ఇవన్నీ మా వాళ్ళ కట్టుబాట్లు మాత్రం కాదు. నేను అలవరచుకున్న అల వాట్లు. నాకు నచ్చిన సర్దుబాట్లు.

అటు తర్వాత అన్నయ్యకూడా నా దురదృష్టాన్నీ, పరోక్షం గా నన్నూకూడా అసహ్యించుకున్నాడు ఒకటి రెండు సార్లు.అయినా నేను బాధ పడలేదు. ఎందుకో తెలుసా? నాకు పెళ్ళి చేయాలని వాడింకా ప్రయత్నాలు చేస్తున్నందుకు కృతజ్ఞతగానూ, ఇంకా దానికి పెళ్లేమిటి అంటూ నా గురించి పట్టించుకోకుండా ఉండనందుకు గౌరవంగా వుంటుంది వాడంటే నాకు.

ఇప్పటికి కనీసం యాభై సార్లయినా పెళ్లిచూపుల పేరిట పరాయి మగవారి ముందు తల వంచుకు కూర్చుని 'నేను మీకు నచ్చానా' అని మౌనంగా అడిగాను. అది విచిత్రమో, విడ్డూరమో కానీ ఏ ఒక్కరూ నన్ను మెచ్చుకోలేదు. ఎంచుకోలేదు. అలాంటి నేను మీకు నచ్చటంకూడా నా మటుకు నాకు విడ్డూరంగానే వుంది.

కుల గోత్రాలు సరిపోతే పెళ్ళాం పిల్లల్ని పోషించగల ఓ మగాడయితే చాలు. అతగాడు నన్ను చేసుకోవటానికి ఇష్టపడటం ఆలస్యం మూడురోజుల్లో ముహూర్తాలు పెట్టించి నన్ను సాగనంప టానికి సిద్ధంగా వున్నారు మా వాళ్లు. నా పెళ్లి అయిందనిపించటం మా వాళ్ల లక్ష్యం. ఆ ఇల్లు వదిలి అత్తవారిల్లనే మరో ఇంటికి నేను తరలి పోవడం వాళ్ల కోరిక. పేదవాళ్లకు నన్ను ఇచ్చి చేసినా మా వాళ్లు ఆర్థికంగా నాకు సహాయం చేయగలరు. ఆదుకోగలరు. వాళ్ల ధైర్యం కూడా అదే.

ఆ మాత్రం ఆర్థిక సదుపాయం నాకు పెళ్లి కాకపోయినా మా వాళ్ళు నాకు అందించగలరు. అయినా ఏ తల్లిదండ్రులైనా పోషిం చుకో లేక కాదుకదా కూతుళ్లకి పెళ్లిళ్లు చేసేది.

బహుశా ఇంతమంది నేను నచ్చలేదని చెప్పడమో, ఉత్తరాల ద్వారా తెలియ జేయడమో చేయడంవల్ల కాబోలు నాకు నచ్చని వ్యక్తికి నిర్భయంగా ఆ విషయం రాయగలిగాను. నచ్చలేదని చెప్ప టానికి వెనుకాడ వలసిన అవసరం లేదని అనుభవం ద్వారాతెలుసు కున్నాను.

ఇంత పెద్ద ఉత్తరం రాసి మిమ్మల్ని ఇబ్బంది పెట్టినందుకు క్షమించండి. నా మనసులో మాట మీకు చెప్పేను. మీ అంద చందాల్ని కించపరచటం గానీ, మీ ఆస్తిపాస్తుల్ని, హోదాను తక్కువగా భావించటంగానీ నా అభిమతం కాదు. మీరు నచ్చక పోవటానికి కారణం ప్రత్యేకించి చెప్పలేక పోయినా మీరు నాకు నచ్చలేదని మాత్రం చెపున్నాను. అయినా తుది నిర్ణయం మీకే వదిలేస్తూ, మీ జవాబు కోసం ఎదురుచూస్తుంటాను.

ఇట్లు
మీరు మెచ్చిన నేను"

ఇంత పెద్ద ఉత్తరాన్ని ఎంతో ఓపిగ్గా, శ్రద్ధగా కూడా చదివి సుధాకర్ చేతికి ఇచ్చాను.

మా ఇద్దరి మధ్యా ఓ పది నిముషాలు మౌనం.

"మరేమిటి నీ నిర్ణయం?" అడిగా న్నేనే.

"ఆమెనే చేసుకోవాలని నిర్ణయించుకున్నాను." అన్నాడు సుధాకర్.

విస్మయంగా చూశా నతని వంక.

"నువ్వు నాకు నచ్చలేదు అని నిర్మొహమాటంగా చెప్పేసిన ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలనే నిర్ణయించుకున్నావా?" ఆశ్చర్యంగా అడిగాను.

"అవును. ఆమెనే చేసుకుంటాను. అందుకు రెండు కారణా లున్నయ్. ఒకటి ఆమె నాకు చాలా నచ్చిన మాట నిజం. రెండోది ఆమెకు నేను నచ్చకపోవటం నిజం కాదు."

"నిజం కాదా?"

"కాదు. ఎంతోమంది మగవాళ్లు 'నువ్వు నాకు నచ్చలేదు'అని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆమెతో చెప్పటంతో ఆమెలో మగ వారంటే ఓ రకమైన కసి, కక్ష ఏర్పడినై. ఎవరైనా సరే ఆఅమ్మాయిని చేసుకోవటానికి ఇష్టపడితే 'నీవు నాకు నచ్చలేదు' అని చెప్పాలనే బలమైన కోరిక ఆమె నరనరాల్లోనూ జీర్ణించుకు పోయింది. ఆ అవకాశం కోసం ఎదురు చూస్తూంది. ఇప్పుడు నా ద్వారా ఆ అవ

కాశం వచ్చింది. తన కోరిక తీర్చుకుంది. తన కసి చల్లార్చుకుంది. అంతేకానీ తనకు నేను నచ్చక పోవటం మాత్రం నిజంకాదు."

అతని సైకియాట్రిస్టు బుర్రకి విస్తుపోయాను. ఓ డాక్టరుగా కన్నా ఓ వ్యక్తిగా ఎక్కువ అభినందించాను అతన్ని. అతని పట్ల నాకున్న అభిమానం ఎన్నో రెట్లు పెరిగింది.

కానీ ఓ అనుమానం.

డాక్టరుగా కూడా అతని అంచనా సరైంది కాకపోతే?

(ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక—ది. 23-3-88)